మంచిముత్యం

శ్రీ బలివాడ కాంతారావు

చైత్రశుద్ధ ఏకాదశి రాత్రి—సింహాచలవరాహ స్వామివారి కళ్యాణోత్సవం. ప్రొద్దు ప్రుంగాక, పేదా గొప్పా, పిల్లా పిచ్చికా, పెద్దలూ పిన్నలూ, పండితులూ పామరులూ, ఉద్యోగులూ వద్యోగులు తరలిరా అసంఖ్యాక ప్రజానీకం నలువేపుల నుంచి కాలి నడకతోనూ, బళ్లు బస్సులమీదను వచ్చి చేరుతున్నారు. దేవాలయం కొండమీద నున్నది. స్వామి దర్శనానికి యించుమించు వెయ్యి మెట్లు ఎగప్రాకాలి. త్రోవంతా విద్యుద్దీపాలతో పట్టపగల్లా వుంది.

రాత్రి తొమ్మిది దాటినా బస్సులు నిండుగా ప్రజలు దిగుమతి అవుతున్నారు. కొండ దిగువనే కొన్ని దుకాణాలు వున్నాయి. యాత్రికుల కోలాహలం, గడబిడలూ, వుత్సాహం, ఆట్టహాసం హెచ్చుగా వుంది. వింతా వినోదం లేదుగానీ కొంత ప్రజమాత్రం బస్సులాగే స్థలంలోవున్న రావిచెట్టు ప్రక్కనే వున్న లైటు వెలుతురులో మూగుతున్నారు. పిల్లలు గెంతుతున్నారు. పెద్దలు వింతపడి నవ్వుతున్నారు—వీళ్లందరి దృష్టిని ఆకర్షించిం దేమిటది? వింతమృగమా అంటే కాదు...సిల్కు చీర కట్టుకొనివున్న ఆడమనిషి. సిల్కు చీర అక్కడక్కడ చిరిగివుంది. ఖద్దరు జాకెట్టు పీలిపోయింది. వెలుతురులో ముఖం పాలిపోయున్నా మెరుగులు పెటినట్లు తెలగా మెరుస్తోంది—"అవ్వే! పెద్దవయసు కాదే" అని రొంటడో అనుకుంటూ పోతున్నాడు.

ఇంకో బస్సు వచ్చి ఆగింది. ఆ దిగిన ప్రజకూడా యిటు తొంగి చూసారు. ఒక పదిమంది ఒక్కుమ్మడిగా వచ్చారు. అందులో ఒక మనిషి. రౌద్రబ్రగ్గా పొగ్గావున్నాడు. నాలుగేళ్ళ క్రితం అయిదు వేలు పుచ్చుకొని పెళ్ళి చేసుకున్నాడు గానీ యింకా పిల్లలు లేరు. పెళ్ళాన్ని వెంట తీసుకరాలేదు. "ఇదా! రండి రండి పోదాం!" అంటూ వడవడగానే మిత్రులంతా వెంటపడ్డారు. మాటల్లోనే, ఉపన్యాస ధోరణిలో

"ప్రేమించి పెళ్లింటూరుగానీ మన సంఘానికి అది పనికి రాదు. యౌవనంలో మనకు బంగారమేదో, బంగారం మెరుగు పూసిన యిత్తడేదో తెలుసుకోలేం!" అన్నాడా పొడైన మనిషి.

అగి మాటలు పొడిగించాడు "పెళ్ళి విషయంలో పెద్దలు చెప్పినట్లు పాటించడమే మంచిది!" వాళ్ళల్లోవాళ్ళు వాదాల్లోకి దిగటంవల్ల నడక మందగించింది.

ఇంతలో లైటుక్రింద కూర్చున్న ఆమె లేచి నిల్చుంది. నలుగురి వేపు కళ్లు పెద్దవి చేసి చూసింది. కాలుస్తున్న సిగరెట్ పీకను క్రింద పారవేసి ఆవులింత తీస్తూ ఒళ్ళు విరచింది. ఒక్కసారి పకపక నవ్వి "మీరంతా నాచుట్టూ రెందుకు మూగారు? నేనేం దేవకన్యనా దెయ్యాన్నా? నేనేం పిచ్చిదాన్ని కానే—బట్టలిప్పి కూర్చోలేదే! నవ్వుతారెందుకూ? పొండి—పోతారా లేదా!" అక్కడే వున్న కంకర రాళ్లను చేతపుచ్చుకుంది. భోళ్లుమని చుట్టూవున్న వాళ్ళు తలా చెదరజొచ్చారు. ఆమె మెట్లువేపు పరుగెత్తుతున్న ప్రజలను వెంబడించసాగింది. వెనుకనుంచి కుర్రాళ్లు కుక్కలా అరుస్తున్నయ్. ఆమె చేతిలోని రాళ్లు ప్రక్కకు నవ్వుతూ విసిరేసింది. ఆ విసిరేసిన రాళ్లలో ఒకటి వుపన్యాసం ఆపిన రౌద్ర బ్రగా పొగ్గా వున్న మనిషికి తగిలింది. తగిలినట్లు ఆమె తెలుసుకుంది. గబగబ దగ్గరకు వెళ్లి వంచి ముఖం దాచుకున్న అతనితో "క్షమించండి! నా చేతులతో యిదివరకే చాలమందిని గాయపరచాను!"

తను జవాబు చెప్పకుండా ముందుకు కదిలిపోతూంటే మెట్ల మొదట్లోవున్న దీపం వెలుతురు అతని ముఖంమీద పడింది. ఆమె యింతలో "ఆగు ఆగు" అని కేకలు వేస్తూ పరుగెత్తింది. ఏంచేస్తుందో అని అంతా కంగారుపడజొచ్చారు. "కోట్టకు...పారిపోక...!" అంటూ దగ్గరగా వస్తూ "విన్యా! నిన్నెంతగా ప్రేమించాను. ఎన్ని రాత్రుల్లో నిన్ను తలంచుకొని నిద్రలేకుండా గడిపాను. నిన్నొక వుత్తేజమైన కథానాయకుణ్ని చేసి ఆరాధించాను!" ఆమె వెకిలిగా నవ్వుతూ చుట్టూ చేరినవాళ్లకు అతనిని చూపిస్తూ "వినండీ వీరుని పరాక్రమం! న్యాయంకోసం తల్లిదండ్రులని ధిక్కరించలేక పోయాడు. ఒక ఆడపిల్లలు గల బీదవాడిభారాన్ని తగ్గించలేక పోయాడు!"

ఆ మనిషి కదిలిపోతుంటే "ఆగు!" అంది. "ఆగకపోయావంటే యేంచేస్తానో! "గద్గద ఆమె మెట్లపై మోకాళ్లపై నిల్చొని దీనస్వరంతో "ఈ నాయకుణ్ని కాసుక్కూడానికి ఆదుకోలేక పోయాను. అప్ప చెయ్యలేకపోయాను, చివరకు దొంగతనమైనా చెయ్యలేకపోయాను...నా కథానాయకుడు వుదాత్తుడని ఎన్నో రాత్రుళ్ళు ఎదురుచూసాను. లేదు ... రాలేదు ... అంతా బూటకం...ఇంకెంతకాలం యిలా పెళ్ళికాకుండా నలుగురిచేత వేళ్లు చూపించుకొని బ్రతుకుతాను...తెలతెలవారుతోంది! అమ్మో...యెంత భీకరంగా వుంది...కొండంత కెరటాలు... అందులో నాక్కావలసిన శాంతి దొరుకుతుంది..."

ఆమె చటుక్కున లేచింది. చుట్టూ తిరిగి చూసింది. "ఏమ... రాలేదూ? ఎందుకొస్తాడా మనిషి! ఎక్కడో ఆ తీరంలో ఇసిక మీద హాయిగా పడుకొని వుంటాడు. అవ్వే పడుకోడే! చాలా విసిగి పడిపోయినవాళ్లను రక్షించడానికి చూస్తుంటాడు—వల్లగావున్నా ఎలాంటి వంపులు తిరిగిన కండలు. ఆ క్షణం ఎంత వెచ్చగా హాయిగా వుంది ఆ శరీరం. మళ్ళీ యింకొక్కసారైనా చూడలే దతన్ని. ఆ జాలరి నా వీరుడా? విన్యా...? డబ్బే నీ బ్రతుకు. అతే

నీ కోవందం ఇస్తుంది...అదే చివరికి తీసుకుంటుంది...వెళ్లు... వెళ్ళు!"

ఆమె అక్కడనుంచి మీదికి గబగబ కదిలిపోయింది. కొంత దూరం పైకి వెళ్లేసరికి ఆయాసం అనిపించింది. ప్రక్కనే దిమ్మమీద కూర్చుండిపోయింది. ప్రజ మీదికిపోతున్నారు. ఆమె మెల్లగా ప్రక్కగా వుండే త్రోవలోనికి వెళ్లి ఒక చెట్టుక్రింద కూర్చుంది. దిగువను తోటలు కనిపిస్తున్నాయ్. ప్రశాంతంగా వుంది. దూర దూరాన పొలాలు మెట్లు గుట్టలా వెన్నెల్లో నిద్రపోతున్నయ్. ఆమె చెట్టుక్రింద చారబడడానికి వుపక్రమిస్తూ మెట్లవేపు చూసింది. తప్పునలేచి "ఓ భక్తుడా! దేవుణ్ని చూట్టానికి వచ్చావా? దేవుడు నీ లాంటి వాడనుకున్నావా దర్శన మీయడానికి—ఆగు... పోరికావ్...నన్ను పెట్టిన బాధలకి...నిన్ను...యీ కొండమీద నుంచి దిగువకు త్రోసిజా...ఆగు...ఆగు!"

ఆమె పరుగెత్తి వచ్చేటంతలోనే ఆ వ్యక్తి ఆగిపోయాడు. వెళ్తున్నవారుకూడ నిల్చొని ఆశ్చర్యంగా చూడసాగారు. ఆయన ఏదో అనబోతుంటే అవకాశం ఇవ్వకుండా గట్టిగా, "ఆ వుంపుడుకత్తె వలలోపడి మాటలతో నా చేతలతో నా నన్ను కవాన్ని చేశాడండీ? నన్ను చావమోదాడు. రెండుసార్లు బలవంతం చావుకు పరుగెత్తి నిచ్చాడండీ!"

ఇంతలో పైకివస్తున్న ఒక వయసుమళ్ళిన మనిషి ఆగి "ఈయన ఎవరనుకున్నావ్—ఏమిటి?"

"ఎవరా! లోకం నా మొగుడంది. కాని నే నీతన్ని నా కసాయివా డన్నాను."

"పాపం పిచ్చిదానిలా వుంది" అని అతను కదలబోతుంటే చెయ్యిపట్టుకొని ఆపి "నిన్నే నేనా పిచ్చి!" పకపక నవ్వుతూ "మీరంతా చెప్పండి పిచ్చియెవరికుంది? ఇందరి ఆడాళ్లను వలలో వేసుకున్నావ్-ప్రేమ అనేది యెలా వుంటుందో చెప్పు?"

ఆమె అదేపనిగా నవ్వుతుంటే అవయసు మళ్ళిన మనిషి "తొలగో!" అని కేక వేశాడు. ఆ కేకతో ఆమె త్రుళ్ళిపడి ఆగిపోయింది. తను మందలింపుతో "భారతీ! ఇక్కడికెందుకొచ్చావ్? ఆ సాంప్రదాయ కుటుంబంలోపుట్టి చిన్నయ్య పరువుతీసింది చాలదా? ఏమీ తెలియని యీ అమాయకుని పరువుతీస్తావ్? చూడు...సరిగ్గా ఆ ముఖంలోనికి చూడు... నీ మొగుడా? వాడు యింకో పెళ్లి చేసుకున్నాడటలే! పో చిన్నగా క్రిందికి...వచ్చిన దారినే పో!"

నిశ్చలంగా నిల్చున్న ఆమె...ఆయువకుని ముఖంలో ముఖం పెట్టి "ఎవరుమీరు? ఆ కసాయికాదూ!...వాతలలో యేదో చెడ పురుగులు పుట్టుపెట్టాయేమో? దూరానికి అలాగే కనిపించారు... క్షమించండి! నాకింకెంతవున్నా—ఎవరిని బాధపెట్టడం...క్షమాపణ చేసుకోటం!"

భారతి అక్కడనుంచి మెల్లగా కదిలింది. మళ్లీ ఆ చెట్టుక్రిందకే పోయి చేరబడింది. ఓక్షణం ఆ గుమిగూడిన వాళ్లామె వేపు చూశారు. ఆ దగ్గరగా యే పాముచేరి కాటువేస్తుందో అన్నట్లు జాలుగావుంది. అవయసు మళ్లినవ్యక్తి "క్రిందికి వెళిపో అమ్మాయ్. అక్కడుంటే ప్రమాదం!"

"నాకొ ప్రమాదం? కాని! నాకోసం యేడ్చేవాళ్లెవరుంటారు-బాబూ? నే చచ్చిపోతే మావాళ్లకిచ్చిన మచ్చకొన్నాళ్లకి చెరిగి పోతుంది. మీరు వెళ్లండి! ఆ దేవుణ్ని చూసారంటే మీరుకోరింది యిస్తాడు—ఏదికోరినా కోరకపోయినా ఆడపిల్లలు జన్మజన్మలకీ వద్దని కోరటం మరచిపోకండి!"

ఆ వ్యక్తి మెల్లగా కదులుతూ "లైబ్రరీలో పుస్తకాలన్నీ చదివేసింది. ఎంతో తెలివైనపిల్ల కాని దాని నొసట దేవుడిలా వ్రాసాడు" అన్నాడు. ఆయన వెళ్ళిపోతుంటే ఆమె "టుబి ఆర్ నాట్ టుబి" అని నవ్వింది. అంతా కదిలారు గానీ యెవరికైతే మొగుడని అనుకుందో ఆ యువకుడు కదల్లేదు. రెండుసార్లు వాలుగు వాలుగు మెట్లుయెక్కి మళ్లీ దిగిపోయాడు. ఆమె అన్న మాటలు తనను కదిలిస్తున్నాయ్. కొంతసేపయ్యాక ఆమెకు చేరువలో కూర్చున్నాడు. ఆమె తనలో తనే యేదో అనుకుంటోంది. వింటా మని మరి కొంత జరిగేసరికి ఆమె కమ్మనిగొంతుక యేదో రాగాలను తీసుకొంటోంది. అలా అతడే కళ్లప్పగించి చూస్తున్నాడు. ఆమె రాగాలు తీసుకుంటూనే శరీరాన్ని కదుపుతోంది. ఆరాగాలు దూరపు కొండల్లోనికి తెల్లని మేఘాలలోకి పోతూ ప్రతిధ్వనించి తనకుండేకు వస్తున్నట్లున్నాయ్. ఆమె ముఖం వెన్నెల్లోనికి వచ్చింది. ఆ పెదవులు యెండిన ద్రాక్షపళ్లలా ఆ కళ్ళు పానపట్టిన కన్నీళ్లా ఉన్నాయ్. ఆ ముఖమంతా రాలిపోతున్న గులాబిలా వుంది. ఆమె చెయ్యి తనపాదం మీద పడింది. ఏదో దివ్యానుభవం అతని శరీరమంతా అల్లుకుంది.

ఆమె లేచి కూర్చుంది. దిగువ దిగువగా ప్రశాంతంగా వున్న ప్రకృతి కనుపించింది. "చూడు యెంత చక్కగా వుందో!" ఆమె దగ్గరగా వెళ్లాడు. ఆమె చేతులతో ఆకాశాన్ని చూపిస్తూ "ఆ పైకి యెగిరే శక్తి వుంటే యెంతబాగున్ను. చందమామను ముద్దులాడి ఆడించేదాన్నే! ఏమిటో వెర్రి! ఇక్కడ నుంచి గెంతికలను గా! గంతి ఆ అందమైన చెట్లను కౌగలించుకుంటే ఆనందం లేదూ—శాశ్వత శాంతి వస్తుంది గా!"

అంటూ ఆమె పడిపోడానికి వుద్యుక్తున్నట్లవుతుంటే అతను ఆమెను పట్టుకొని వెనుకకు లాగి కూర్చోబెట్టాడు. అతని వేపు యెగాదిగా చూస్తూ "అందరూ నన్ను మంచిదానివనుకుంటున్నారే! నీమంచి లోనూ చెడును నాకు కనిపిస్తోంది."

"ఒక మాటంటాను—" ప్రాధేయపడుతున్నట్లు అడిగాడు.

"చెప్పు!"

"ఇలా క్రిందికి పోదామా?"

"ఆ స్వలాభంతోనే నన్ను పడిపోకుండా ఆపుతున్నావు గా? ఆశ్చే నేరాదు — నేనెందుకొచ్చా నిక్కడికి — పడిపోడానికి కాదు—ఆ ముసలమ్మ చెప్పింది కదూ దానికి. నిన్ను పరీక్షిస్తూ కూర్చుంటే ఎలా? మీదకు పోవాలి" అంటూ ఆమె లేచి మెట్లవేపు వెళ్ళింది—ఆమె పైకి పోతుంటే అతను వెంటపడ్డాడు.

అంతే రొమ్ముల్నించి దబదబ నీళ్ల ధార వస్తోంది. మీదికి పోయే యాత్రీకులు ఎలదబడ్డారు. భారతి యెదురుగా రెండో వేపు కొందరు బిచ్చగాళ్ళు కూర్చున్నారు. అందులో తల నెరసిన ముసలివుంది. ఆ ప్రక్కనే ఒక కుంటిపిల్లవాడు కూర్చున్నాడు. ఇద్దరి యెదురుగా పరిచివున్న మాసిన బట్టల్లో డబ్బులు, బియ్యం పడివున్నాయ్. ఆమె ఆ కుంటి పిల్లవాని దగ్గరగా కూర్చుండిపోయింది. ఆ యువకుడు వారించడానికి ప్రయత్నించినా లాభం లేకపోయింది. అంతవరకూ "కుంటివాణ్ణి బాబూ! ధర్మంచెయ్యండి బాబూ" అని అరుస్తుంటే కుర్రవాడు అరవటం ఆపి కొంచెం గాబరాపడ్డాడు. కొడ్తుంటే లేచి పొయ్యేవాడే. ఆమె ఆ కుర్రవాని తల నిమురుతూ "అయ్యో పిచ్చి తమ్ముడూ! ఎందుకలా వీళ్లని సహాయం చేయమని అరుస్తావ్-వాళ్ళదంతా వేషం, డాబు, దర్పం—ఏ పాపం యెరగని నువ్వు పాపాలకు పుట్టిల్లయిన వాళ్ళ చేతి కానీ పుచ్చుకుంటావా? పద—పద... మీదికి పద..."

లేవలేని ఆ కుర్రవాని చేతులుపట్టి మీదికి లేవనెత్తుతుంటే "నే రానని" వాడు వెనుకకు లాగుతున్నాడు. "లేస్తావా లేదా! నీ మంచికే చెప్తున్నా—ఆ దేవుని చూసావంటే చాలా కాళ్ళు వస్తాయ్—అప్పుడిలా అడుక్కో అవసరం లేదు. నామాట నమ్మవూ? నీకు దేవునిమీద విశ్వాసం లేదూ?"

అంటూ ఆ కుర్రవానిని రొమ్ముకానించబోతుంటే వాడు గోల పెడుతున్నాడు. ఆ ప్రక్కనే వున్న ముసలమ్మ విడిపించబోతూనే "ఇంకా వాణ్ణి విడిచిపెట్టవూ? అబ్బా—వీరిదే వృత్తి...వదే... నీమాట వినకపోతే ఆకలితో చంపేవూ..." ఆ కుర్రవాణ్ణి అక్కడే వదిలేసి—బట్ట, జారు సర్దుకొని తీరుగా నిల్చొంది. ఓ క్షణం పోయాక చిరాకుగా "అందరూ నన్నే యెందుకు ఎంచుకుంటారు? ఇంతమంది నిల్చున్నారుకదా! ఒకరూ వచ్చేరా! అబ్బా... అబ్బా... ఈ ముసలమ్మ యెప్పుడు మట్టయిపోతుందోగానీ!"

ఆ ముసలమ్మ "నే మట్టయితే నీకేం వస్తుందమ్మా!"

"స్వస్థ్య! ఈ పాడుగదుల్లో బతుకుపడిపోతూ! అబ్బా! ఈ యింటికి యెవరూ అగ్గయినా పెట్టరేం? ఆ మంటల్లో యీ పాపం అంతా మండిపోయేది!"

ఆమె అంతలోనే ఆ యువకుని వేపు విచారంగా చూసి "నువ్వు నన్నే యెంచుకున్నావా?" అంది.

"హాఁ" అన్నాడు.

"నన్నే యెంచుకోడానికి నాలో యేముంది?"

"నాక్కావలసినదంతా వుంది..."

ఆమె అడుగులు వేస్తూనే "లేదు లేదు—నా అందమూ పోయింది—నేను చిన్నదానినీ కాను. నా జీవితంలో అంతా పోయింది ఒక్కటి తప్పించి......"

"ఏమిటది?"

"ఆశ..."

"అదెప్పుడు వుందో అంతా వున్నట్లే" అన్నాడు.

ఇంతలో వెనకనుంచి వచ్చే వ్యక్తి ఆ యువకుని పలకరించాడు. ఆమె ఆయువకునివేపే వచ్చే ఆ మనిషితో "ఎవరమ్మా మీరు? చాల మర్యాదస్థుల్లా వున్నారే!" అంది. ఆమె ముఖం వెలిగిపోతుంది. "తను మీ ఆయనగారేనా" ఆమె అవునన్నట్లుగా తలవూపింది.

"ఈ మగవాళ్ళెంత మంచివాళ్లు. అందులో మీ ఆయనకు మీ రంటే పిచ్చేకదూ?"

"ఆమె ముసిముసి నవ్వింది.

"మిమ్మల్ని తప్పించి పరాయి స్త్రీముఖం చూడలేదుకదూ?"

భార్యనంటే గర్వం వ్యక్తపరచడానికి "అవును" అంది తలెత్తి.

"ఎలా చెప్పగలరు?"

"నాకా విశ్వాసంవుంది" గొణిగింది ఆమె. అంతలో పూర్తి కాక "ఆయన మీ ఆయనే కదూ? మీరు మాత్రం అలా వుండరా?" అంది.

భారతి పకపక నవ్వడానికి మొదలుపెట్టింది. నవ్వు నాపుకోలేకారయిపోతున్న ఆమెతో "మగవాడు అనేవాని అందమూ పిచ్చివాడివదూ? నీకంటే నేను అందంగా లేనూ? అంచేత నీ మొగుడు..."

"ఏమంటావోయ్" అని కేక వేసిందామె. ఆ మొగుడు ముందుకే పోతున్నాడుగాని వెనకకు తిరగలేదు. అంతలో ఒక పదిమంది గుంపు వెనకనుంచి వస్తున్నారు. ముందుకు గబగబ ఆమె వెళ్ళిపోతుంటే భారతి రెండుచేతులూ చాపి అడ్డుపడింది. ఆ వచ్చే పదిమంది గుంపును కూడా తిలకించే అడ్డుకుంది. వాళ్లేనో అంటుంటే యీమె పళ్ళుకొరుకుతూ జుట్టంతా విరబోసుకొని "దేవునిదగ్గరకు వెళ్తున్నారు. మీరుచేసిన పాపా లేవో చెప్పండి. లేకపోతే ప్రోవ వదిలేది లేదు!"

ఒక మొగాడికి పౌరుషంవచ్చి "మా పాపాలా అడుగుతున్నావ్ పాపిష్టిదానా! బజారులోపడి—ఆ కులానికే అపకీర్తి తెచ్చావు. పిచ్చిపోయిన కొడుకులపోయి—ఆఖరికి..."

ఆ మనిషితో మాటాడుతూ ముందుకు జరిగిన యువకుడు తిరిగి గబగబవచ్చి "భారతీ! ఇదేమిటిది... శ్రోతలో శ..."

అలావుంటే "వచ్చావా ఆ యువస్త్రీకూ..."

"అక్కడే వున్నాడు. అదిదాని విడిచిపెట్టు, వెళ్లిపోతుంది!"

"ఇక్కడికువచ్చి అదిపెను తీసుక వెళ్ళకూడదూ?"

"ఎందుకే గొడవ"

"రమ్మని పిలు!"

"పిల్చాను"

"రాలేదుకదూ...హో...హోఁ...ఎందుకొస్తాడు. నాకు దెబ్బ కాదుకదూ? వన్నాతో కుంభించి చివరకు ఆ నేరం క్రిందవేసి జైలులో పెట్టాడు."

"మర్యాదగా మాటాడే!

ఏమంటావోయ్ రండి రండి ... ఈ పిచ్చిది..."

భారతి ఆమె కేకలు అనుకరిస్తూ "ఏకండో రండి రండి మొగుడు మోహాన్ని తెలుసుకోలేని యీ పిచ్చిది...ఆరాధిస్తోంది!"

"శే అమ్మా—అకేరిటాపని..." ఆగొంతుకవిని తలయెత్తింది. ఆ పదిమంది మధ్యనున్న యెత్తైన సుందరవిగ్రహాన్ని చూడగానే ప్రక్కకు తప్పుకొని చేతులెత్తింది...నమస్కరిస్తున్నట్లు...

"అన్నయ్యా! వదిన, పిల్లలూ బాగున్నారా?" అంది.

"ఆఁ బాగున్నారమ్మా..."

తనతో పాటు ఆమె అలా మెట్లపై కూర్చుండిపోయింది. అందులో ఒకాయన ఆయనతో "శంకరం ఏమిటో ఆసలు కథ" అన్నాడు. అతనికి ఆమే సమాధానం యిచ్చింది. "కూర్చోండి నాకథ నేనే చెప్తాను" కాని వాళ్లు కదలిపోతుంటే అందర్నీ అడ్డుకుంది. వాళ్ల చేతులు పట్టుకుని కూర్చు పెట్టు చేసింది.

కూర్చోపోతే యేం చేస్తుందో నన్న భయంతో ప్రక్కగా వాళ్లంతా మెట్లపై కూర్చున్నారు లేచింది. ఆ దగ్గరగావున్న ఒక చిన్నరాయి చేతపట్టుకొనివచ్చి కూర్చుంది. ఆరాయి శంకరం చేతికిస్తూ" నాది తప్పయితే చెప్పండి. ఈ రాయితో కొట్టి నరికిద్దండి—ఇదీ నాకథ. నేను మీలానే పుట్టాను. మా నాన్న ముద్దుగా భారతిగానే పెంచాడు. ఇందరు కూతుర్లుండగా అమ్మ పోతే మళ్ళీ పెళ్లెందుకు చేసుకోవాలి? మాయెదరగా ఆమెతో నవ్వులాలు, కేరింతలు! అయినా మా నాన్న సంఘంలో యెంత మంచి మనిషి?

పెళ్లివాడు ఆమెగుడు యెంత అమాయకంగా కనిపించాడు. ఆమ్మో రాక్షసుడు. ఇందరుండగా అడ్డుకోలేం? మీకు నాలాంటి పిల్లలులేరూ? అవును—వాళ్ళు మంచిదికాదంటారు. నాకు బ్రతకడం తెలీదంటారు. తప్పంతా నామీదే వేస్తారు. వాడు సరిగ్గా వుంటే నేనెందుకు జవాబులు చెప్తాను? తినివుండలేక మొగుణ్ని వదిలేసి వచ్చినావట! కన్నవారింట్లో భరించలేని మాటలు ఈ నరకంనుంచి రక్షిస్తానని నన్ను మోసపుచ్చినవాడేడీ. తల చెక్కలుచేస్తాను" అని రాయితీసుకోడానికి ప్రయత్నించింది. కాని యెవరిమీద విసురుతుందనో శంకరం ఆమెచేతికి అందివ్వలేదు. గుంజాటనపడి లాభంలేక చ్రురున కోపంతో నాలుగు మెట్లెక్కి,

"నివ్వా! శంకరం అన్నయ్య...నా కొడుకును నివ్వేకదూ చంపేశావ్?"

అంతా నిశ్శబ్దం అయిపోయింది.

"నేనా!" అన్నాడు వూపిరి బిగబట్టి శంకరం. "పిచ్చిదానితో మనకెందుకు. పదవోయ్ శంకరం!" అన్నాడో మిత్రుడు. లేచారు. కాని శంకరం లేవలేదు. లే లే అని ఒకాయన చెయ్యిపట్టుకొని లేవనెత్తారు.

"ఆ కొడుకుదానే యీ మెనీ పరిస్థితికి తెచ్చింది! కానీ నే చంపానా?" శంకరం అన్నాడేగానీ కాళ్లు కదపలేకపోయాడు. మెట్లుప్రక్క నేవున్న గోడను పట్టుకొని తల ఆన్చి ఆమె అలానే నిల్చుంది. ఆమెతోవున్న యువకుడు కొత్తయెడంగా నిల్చున్నాడు. ఆ దగ్గరగావున్న శంకరంతో "యీమెకు కొడుకుపుట్టాడా?" అన్నారు.

ఆమె చ్రురున లేచింది "అవును నా బాబుతల్లిని నేనే... మా బాబు నాన్న పేరు నాకు తెలీదు! ఏడీ...నానా యనా...ఇది గోరా! నిన్ను చంపిన మనిషి వచ్చారు...మీ మామయ్యా... రానాన్నా ఆ ముఖం చూద్దువుగాని..."

ఆమె భోలభోలా యేడ్చేస్తోంది. అంతా అలానే ఆగిపోయారు! శంకరం వాడినముఖంతో "నాకేం తెలీదండీ! వాళ్ళదో జాతి! మాదో జాతి! ఒకసారి చదువుకుంటున్నానని యేదో సహాయం చెయ్యమని కోరింది. చేసాను. ఎవరితో లేచిపోయిందని నాకు అనుభవించి యెటో పోయాడని విన్నాక కూడా శక్తి సహాయం చేసాను."

ఆమె గట్టిగా యేడుస్తూనే "చేసావ్. అసలు సమయానికి యింట్లోవుండి లేదనిపించుకున్నావ్. నివ్వొ అయిదురూపాయలిస్తే నా బాబుకి మందుపట్టేదాన్ని—బ్రతికేవాడు. నా ఒళ్లు అమ్ముకుంటూనన్నా పిప్పిమనిషిని యెవరూ చేరాదుకాదే...నివ్వా నేనా నా బాబుని చంపింది?"

ఈ మాటలు విసరి ఆమె అలా కూర్చుండిపోయి మోకాలు మీద తల ఆన్చి వెక్కి వెక్కి యేడుస్తూనే వుంది. శంకరం కాస్సేపు ఆ దగ్గరగానే కూర్చుండిపోయాడు. ఆమె కొంతసేపయ్యాక లేచి ఎదరగా రెండోవేపు మెట్లుప్రక్కనవుండే ప్రదేశం వేపు నడిచింది. ఆ దారి కొండగుహాలోనికి వుంది. అందులో యిదివరకు ఒక సాధు వుండేవాడట. తల క్రిందికి కాళ్లు మీదకు పెట్టి వెళ్లే యాత్రికుల కంటికి కనుపించేవాడు. ఆయన గురించి యెన్నో కట్టుకథలు లేచాయి. ఒకరోజు తెల్లవారేసరికి సాధు అక్కడ లేడు. ఆ సొరంగం తిన్నగా కాశీకి వుందని అందులోనించి అక్కడకు చేరుకొని వుంటాడని చాలమంది నమ్మకం. ఆ గుహాలోనికి భారతి వెళ్ళింది. ఆమెను ఓదార్చి వస్తానని మిత్రులను పైకి పంపించి శంకరం గుహాదగ్గరకు వెళ్ళాడు. అప్పటికే యాత్రీకులు బాగా పల్చబడ్డారు. ఉండీ వుడిగి ఒకరూ యిద్దరూ అలా పోతున్నారు. ఇంచుమించు నడిరేయి. జల జలా దగ్గరగనే ఒక నీళ్లధార పడుతోంది. గుహాలో చిట్టచీకటిగా వుంది. వెన్నెల వెలుగు వలన యీ ముందుగా ఒక మనిషి కూర్చున్నట్లు గుర్తుపట్టవచ్చు. శంకరం వెంట ఆ యువకుడు కూడా వచ్చాడు. ఆమె వీళ్ళ వేపు చూడనేలేదు. శంకరం గుహాలోనికి తలపెట్టేసరికి మట్టెకంపులా వాసన వేసింది. ఆమె కాళ్ళు చాచుకొని ఒకవేపు వారబడి ముఖం అంధకారంవేపు త్రిప్పి తనలో తనే "బాబూ! నివ్వు కడుపులో వున్నపుడు ఆకలితో బాధపడినా...నీ తలపుతో నా కడుపు నిండిపోయేది. కడుపులో కదులుతున్న నీ చిరుపాదాలు...తల...పైనుంచి నాకుతూ సంతోషంగా గొంతుకలేసేదానను నాన్నా... నీవు పుట్టినరోజున యేమయ్యిందో తెలుసా...వింటున్నావా?...ఓ సందులో రోడ్డువారలో తెలివితప్పి పడితే...ఎవరో ధర్మతల్లి ఆసుపత్రిలో చేర్చి వెళ్ళిపోయిందట...తెలివి వచ్చింది...ఈ నీతిలేని మనిషిని, నీతిగల అమ్మలెన్ని మాటలు పరోక్షంగా అన్నారో...ఎంత బాధ...కానీ అన్ని బాధలూ...నన్ను...యీ గతిలేని మనిషికి అమ్మా అని పిలిచే

నాకుంటాడని...నాకీ ఆశేది యీ ప్రపంచంలో ఒకటే వుంటుందని ...ఓర్చాను నాయనా! పుట్టావు—నేను తప్పించి నీ పుట్టుకకు సంతోషించే దెవరు? నీ పుట్టుకతో నేను యెన్నో ఆశలు పెట్టుకున్నాను—నన్నూ నా పాడుజీవితాన్ని మరచిపోయాను. ఈ లోకంలో నాయంత గర్వించిన మనిషి లేకపోయిందా క్షణం. నా చీకటి బ్రతుకులో వెలుగొచ్చింది—తుపానులో చిక్కుకున్న నా జీవిత నావకి ఒక ద్వీపంలా అగుపించావు బాబూ..."

వినువెంటనే నేలపై దొర్లి యేడవసాగింది. నన్నిలా నువ్వు అన్యాయం చెయ్యటం భావ్యం కాదు నాయనా అంటూనే తల బాదుకుంటుంటే, శంకరం ఆమెను వారించబోయాడు. ఆమె అతన్ని త్రోసివేసినా శాంతంగా "మానవమ్మా! చచ్చినవాళ్లెంత యేడ్చినా రారు! ఈ చీకటిగుహలో వుండటం మంచిది కాదు...... రా......రా......"

"ఈ పిచ్చికాయని తీసుకపోయి యేంచేస్తావ్ ?" అంది ఆగి, "మందులిప్పించి బాగుచెయ్యిస్తాను" అన్నాడు.

"బాగుచెయ్యించి......యేంచేస్తావ్ ?"

శంకరంకు సమాధానం దొరకలేదు. ఆమె క్షణంఆగి ఫక్కున నవ్వి "నీ మందూ తిండిలో నేను మళ్ళీ చక్కగా తయారౌతాను. చక్కని ఆడదానియందు మగాడిప్రవర్తన యేవాడూ స్వలాభంతోనే కూడుకొనివుంటుందని నా జీవితంలో తెలుసుకున్నాను. వెళ్లండి—వెళ్లండి!"

ఆమె అలాఅంటూ యింకా గుహలోపలికి వెళ్లిపోయింది. వాళ్ళింకా కదలకపోవటంచూసి భయంకరమైన శబ్దాలుచేస్తూ జడిపించబోయింది. శంకరం గుహలోపలికివెళ్ళి "చీకటి. ఇంకా లోపలికి వెళ్ళామంటే పాములు వుండగలవ్....."

ఆమె హటాత్తుగా అతని మాటలకు అడ్డువచ్చి "ఆ పాము కాటు మనుషులు వేసిన కాటుకన్నా అపాయకరమైనది కాదు. నన్నిక్కడే వుండనియ్యి. చీకటికి నేను అలవాటుపడిపోయాను. విచారమే నా నొసటిరాత—పాపమే నా భాగ్యం—నా యీ దేహం గంతాను. యీ చీకటికొట్లోనే భయం, సిగ్గూలేకండా బ్రతకగలదు...వెళ్లండి ... వెళ్ళిపోండి ... కదలరేం ?...నా కొడుకును తల్చుకోనివ్వరేం......"

శంకరంవచ్చి ఆమెచెయ్యి పట్టుకొని "నామాటవిను, రా!" అన్నాడు. చెయ్యివిదిలించుకొని మెల్లగా గుహద్వారంవేపు ప్రాకజొచ్చింది. శంకరం, ఆ యువకుడు బయటనిల్చున్నారు. ఆమె గుహబయటకువచ్చి నిటారుగానిల్చొని క్రోధస్వరంతో "ఏమి మగవాళ్లు! మీరంతా యెద్దులూ పెద్దులూ! అబ్బా! ఏవిటీ జీవితం తియ్యనిమాత్ర—మధ్యను విషం!"

"ఆ విషంలేని మాత్రే యిస్తాను...పద భారతీ!" అన్నాడా యువకుడు. ఆమె పెద్దపెట్టున నవ్వసాగింది. ఆ నవ్వులో గొంతు లేస్తూ "ఆ విషం లేకపోతే నువ్వు చిరంజీవివి కావూ! చావులేని మనిషేడీ? సరేగానీ......" అంటూ ఆమె నవ్వు నాపి భీకరంగా "పోతారా లేదా? చూడండి...యేంచేస్తానో?" అని యింకా కదలని ఆ మనుషులనుచూసి అక్కడేవున్న యెండిన కుప్పనుంచి ఒక కర్ర విరచి వెంట తరమటానికి వుపక్రమించింది. ఆ యువకుడు గబగబ పరుగెత్తి ముందుకుపోయాడు. కానీ శంకరంమాత్రం కదల్లేదు. ఆ కర్రతో ఆమె శంకరం వీపుమీద గబగబ మూడు సార్లు కొట్టింది. ఉఁ అనైనా అనకుండా అలా మూడు దెబ్బలూ కాసాక, కర్ర పారవేస్తున్న ఆమెతో వీపు చూపిస్తూ "ఇంకా కొట్టు! రక్తం చిమ్మేటట్లు కొట్టు! నీకు చేసిన అన్యాయానికి కొంతైనా...!"

అతని నోటివెంబడి బాధతో మాట యిక రాలేదు. ఆమె అతని యెదరగా నిల్చొనే సహజంగా రాలుతున్న కన్నీటితో "నీ కెంత చెప్పేదాన్ని. నేను నిన్నుకొట్టానా? అదేంటో నా రాతగానీ... నన్ను ప్రేమించేవాళ్ళనే, నా మాటలతోనూ చేతలతోనూ కష్ట పెట్టుంటాను..." ఆమె అతని రెండుచేతులూ పట్టుకొని "వేడుకుంటున్నాను...నీ మంచికోసమే చెప్తున్నా ... యీ బురదను నీ ముఖానికి రాసుకోక...యీ ప్రాణంపోయే మరుక్షణంలోనే యీ శరీరం కంపుకొట్టుంది. నేను నరకంలో వున్నా ప్రేమనేది వుంటే స్వర్గంలో వుంటే ప్రేమించగలవు"

ఆమె ఆగిపోయింది. అతని కనుకొలకుల్లో నీరు నిండిపోయి శరీరమంతా వుద్రేకంతో విజృంభించ సాగింది. ఆమెను తన బాహువుల్లో బంధించి ఆ పెదవులు చేర్చి గట్టిగా మనసుతీరా ముద్దాడాలనిపించింది. కానీ...కానీ...అతను అప్పుడే యింకో స్త్రీ పెదవులతో తన పెదవులు కదిపాడు...యింకో స్త్రీ కండలని తాకాడు. కాళ్లు కట్టుబడుతున్నా తలదించి తిరిగి మెల్లగా అడుగులు వేసుకుంటూ మెట్లమీదకు వచ్చేసాడు. ఆ యువకుడు వేసిన ప్రశ్నలతనికి వినిపించలేదు.

తన వెంటబడుతూ యేవో విషయాలు అడుగుతుంటే శంకరం ఆగి మెల్లగా "నేను నీకు తెలియకపోవచ్చు కానీ నిన్నెరుగుదును. ఎందరో అమ్మాయిల బ్రతుకులను నాశనంచేసిన నీ శీలానికి అసహ్యించుకునే వాడ్ని. కానీ యీమెమీద నాలో దాగుండిన కోరికలు నీకంటే నన్ను వుత్తముడ్ని చెయ్యలేదు...నన్నింకేమీ అడగొద్దు" అంటూ శంకరం తలవంచుకొని మీదికి వెళ్ళిపోయాడు.

భారతి అలా గుహాద్వారంలో కూర్చుండిపోయింది. దాహం వేసింది. దగ్గరగా వున్న జలధారదగ్గరకు వెళ్ళి నీరు త్రాగింది. కాస్త నీరసం అనిపించింది. ఆవులింతలు వస్తున్నాయ్. నిద్దర ముంచుకొస్తోంది. గుహ మొదట్లో శరీరం వాల్చింది. రెప్పవాల్చటం, యేదో తలపుకొచ్చి రెప్పలెత్తటం జరుగుతోంది. ఉండి వుండి చల్లనిగాలి వీస్తోంది. ఆకాశాన మేఘాలు అక్కడక్కడ చెదరి వున్నయ్. జలజల శబ్దం శ్రావ్యంగా వినిపిస్తోంది. ఆమె నిద్దర నాపుకోడానికి కామోసు వెల్లకిలా పడుకొని ఆకాశంవేపు చూస్తోంది. ఇంతలో కమ్మనైన సన్నాయిస్వరం ఆ యెత్తునుంచి వినిపించసాగింది. మృదుమధురమై మనసును వుల్లాసంగా ఆ స్వరం అటువేపు లాగుకుంటోంది. ఆమె లేచి కూర్చుని కాస్సేపు చెవులు నిక్కించి విన్నది. తరవాత నిల్చొని ఆ స్వరం వచ్చేవేపే మెట్ల మీదనుంచిపైకి నడచింది.

కొన్ని మెట్లు రెక్కి ఆయాసమనిపించటంవల్ల కూర్చుంది. అక్కడనుంచి వాద్యస్వరంతోపాటు ప్రజల కోలాహలం వినిపిస్తోంది. మళ్ళీ పాదయాత్ర సాగించగా కంటికి మొనతెగని సమూహం యిసుక వేసినా రాలని మానవులసంఘం అగపడింది. ఆ యెత్తైన బంగారుమయమైన దేవాలయగోపురం వెన్నెల్లో మెరుస్తోంది. ఆ వెనుక గోడలా పర్వతం వుంది. దేవాలయానికివెళ్ళే మెట్ల దిగువగా మూడంతస్తుల రథం. రథం అనేకరంగుల బట్టల తోరణాలతో అలంకరింపబడివుంది. రకరకాల పువ్వులతోరణాలు రథం చుట్టూ కట్టబడివున్నాయ్. కోవెల మండపంమీదనున్న యెత్తయిన స్తంభాలమీదనున్న కాంతివంతమైన విద్యుద్దీపాల వెలుగు, యీ యాత్రాస్థలమంతా ధగధగలుగా చేసింది. రథం రెండో అంతస్థులో స్వామివారి విగ్రహం - పూలగుత్తులతో సగానికి కప్పబడివుంది. అర్చకులు స్వామి సన్నిధిని భక్తితో కూర్చున్నారు. రథంముందుగా తాళ్ళను పట్టుకొని లాగటానికి యెందరో సన్నద్ధులైయున్నారు. పెట్రమేక్సులైట్లు వెలుగులో స్వామివారి విగ్రహంలో రమణీయత అగుపిస్తోంది. రథం కదిలే సమయం ఆసన్నమైంది.

భారతి ఓక్షణం రెప్పవాల్చకుండా అంతా చూసింది. ఆమె దృష్టి చివరకు రథంలో వున్న దివ్య సుందరమూర్తి వేపు కేంద్రీకరించింది. సమూహానికి దూరంగా ఆ చివరలో నిల్చొనే అక్కడ నుంచే చేతులెత్తింది—శరీరమంతా గగుర్పాటు చెందసాగింది. అలా ఆమె జోడించిన చేతులను తలమీద పెట్టి కళ్ళుమూసి

"తండ్రీ! నేను-నీబిడ్డను. పాపిని. అలా అని నన్ను విడిచిపెట్టగలవా? పవిత్రులకన్నా పాపిష్ఠిమీదే నీకు దయ లావట! త్రోవతప్పినవారికి త్రోవచూపిస్తావుగానీ త్రోవలోపోయేవారితో నీకేంపని? భాగ్యభోగాలు అడగను. సుఖం కాంక్షించను. ఒకే ఆశతో వచ్చాను. నా బాబుని నా కిస్తావని... నా కియ్యవూ?"

ఈ చివరిమాటలు ఓ పదిసార్లైనా అన్నది. మనసులో నెంత అనుకున్నా బాబుని దేముడు యివ్వలేదు. ఆమె ముందుకు సాగి గట్టిగా "మనసులో అనుకున్నమాటలు వినపడలేదా తండ్రీ! గట్టిగా అంటున్నా... నా బాబుని నాకిచ్చు తండ్రీ!"

రథం కదులుతున్న సమయంలోని ఆ కోలాహలంలో ఆమె కేకలు ఆమెకే వినపడలేదు. ప్రజలు ఒక్కుమ్మడిగా త్రోసుకుంటూ కదిలిపోతున్నారు. ఆ తోపులాటలో ఆమె చిక్కుకుంది. దానివల్ల ఆమెకు వూపిరిసలపలేదు. అక్కడే కాళ్ళు తెగినట్లు కూలబడిపోతున్న శక్తి తెచ్చుకొని రథంవేపు మనుష్యుల్ని తలతో తోసుకుంటూ ఖాళీ చేసుకొని వెళ్తోంది. 'గోవిందా' అన్న కేకలు మిన్నుముట్టుతున్నాయ్. ఆమె దగ్గరిల్లిపోతూనే అలా ప్రాకుతూ అతికష్టంమీద రథంలాగుతున్న ఒక మనిషి కాలును పట్టుకోగలిగింది. వాడు ఏదో అనుకొని కాలువిసిరాడు. ఆమెముఖానికి బలంగా తగిలింది. చచ్చిపోయినట్లు ఒక్కసారి కూలబడితే యెవరో యెత్తి పట్టయింది. యెవరెత్తింది ఆమె చూడలేదు. ఆ తాడు ఆమెకూ దొరికింది. ఆమె లాగుతూ "గోవిందా" అని అరచింది. ఇంకా రథం దగ్గరగాపోయి ఆ అంతస్థు యెగబ్రాకి స్వామి సన్నిధిలో తల వాల్చి కొట్టుకొని, ప్రార్థించి, యేడ్చి, తనబాబుని తెచ్చుకోవాలనే వుబలాట, విశ్వాసం ఆమెకు శక్తినిస్తోంది. ఆమెను దగ్గరగా పోనివ్వకుండా యెవరో అడ్డుతున్నారు. ఆ ఆఖరి వ్యక్తిమీద ఖస్సుమని లేచింది "నా దేముడు నా తండ్రి! నా కష్టాలు చెప్పుకుంటానంటే అడ్డడానికి నివ్వెవ్వడివు?"

"ఒడ్డమ్మాయ్ ఆ చక్రాలకిందపడ్డావంటే చస్తావు!"

"అంత నమ్మకంలేకుండా దేవుని దగ్గరకెలావచ్చావ్? నమ్మే వాళ్ళను చంపుతాడా? అలాంటిది వందచక్రాలమీదనుంచి వెళ్ళినా ఛావురాదే! చూడు కావలిస్తే."

ఆ పోలీసు జవాను ఆమెను అటు వెళ్ళకుండా అడ్డుకుంటే నానా రభస చేసింది. వాడి టోపీలాగబోయింది. చేయి పట్టుకుని గుంజాటన పడింది. కానీ ఆ జవాను ఆమెను అటువేపు కదలనివ్వలేదు. క్రిందనుంచి ప్రాకి తప్పించుకోబోయింది. ఈ సారి యింకో పోలీసుకూడా తోడయ్యాడు. తను అనుకున్నటు సాగకపోవటంతో గట్టిగా "మాకుతండ్రీ! నీ దగ్గరకు రానివ్వకుండానన్నిలా అడ్డుకొంటున్నారో యీ రాక్షసులు! నీ చక్రంతో వాళ్లను వాత మార్చుప్రభూ" అంటూ ఆమె అంతలో వుగ్రురాలై త్రోవ చేసుకోలేక వాళ్ళ చేతులు పట్టుకొని కరవజోచ్చింది— కోలాహలం హెచ్చిపోయింది. రథం ఆగింది. "అదిగో నా కోసమేనా తండ్రీ రథం ఆపాడు. వదలండి" ఆమె యీ మాటలు అంటుండగానే యిద్దరూ పోలీసులూ చెరో చేతిని పట్టుకొని జనసమూహంనుంచి ఖాళీ చేసుకొని బయటకు తీసుకుపోతున్నారు. ఆమె గుంజాటన పడుతూ పెద్ద కేకలతో "తండ్రీ...తండ్రీ...వీళ్ళు నన్ను యీడుస్తుంటే చూస్తూ యెలా వూరుకుంటున్నావ్? రథం ఆపిన వాడివి యీ మాత్రం కనికరం చూపించవా? నీ కాళ్ళమీద పడి మ్రొక్కుతాను. నా బాబు గురించి నీ దగ్గరగా వచ్చి చెప్పుకో నీయవూ? ఆ బంగారుబాబు! చారదేసికొన్నా..." ఇలా కేకలు వేస్తుంటూనే రథం కదిలిపోజొచ్చింది. ఆమెను మెట్లెక్కించి కోవెల లోనికి ఆ పోలీసులు తీసుకపోతుంటే కదలే రథం వేపు చూస్తూ "ఇదేనా నీ దయ. నీదంతా బూటకమేనా తండ్రీ! నువ్వు వుత్త పాషాణమేనా? ఈ పాషాణంలో జగాన్ని త్రిప్పే ప్రాణం వుందని వెర్రిదాన్నయిపోయాను. నిజంగా నేను వుత్త వెర్రిదాన్ని. నువ్వు నిజమైన దేవుడివైతే—నీ కెందుకు ఈ అట్టహాసం—ఈ బాజా లెందుకు భజంత్రీ లెందుకు! దరిద్రనారాయణుడివై నాలాంటి పతితుల కష్టాలు తెలుసుకొనే వుందువు!"

రాను రాను ఆమె గొంతుక పట్టిపోయింది. అరిచే శక్తికూడా లేదు. అలా నోరు మాత్రం మెల్లగా గొణుకుతూ కదులుతూనే వుంది. దేవాలయ గంట స్తంభం వరకు యీడ్చుకొని వెళ్ళిన పోలీసులకు మళ్ళీ యీడ్చే అవసరం లేకపోయింది. ఆమె నిల్చుంది. నిల్చుంటే కాళ్లు స్వాధీనం తప్పినట్లు నీరసంగా వుంది. ఆమె చెరో చేతిని ఆ పోలీసులమీద వేసింది. వాళ్లామెను సంతోషంగా ప్రక్క చూపులతో చూస్తూ ముందుకు నడిపించారు. దేవాలయం ఉత్తర ద్వారంగుండా బయటకు తీసుకవెళ్లారు. అలా మెట్లగుండా వుంటే త్రోవ పుట్టుధారవద్దకు పోతుంది. ఆ ప్రదేశంలో ఉదయమే

పొన్న దానికి మకాలు తియ్యించుకోడానికి వచ్చే జనం వుంటారు. ఈ రాత్రిమీద నిర్జనంగా వుంది. ఆమె నడుస్తుందేగానీ నీరసంతో తెలివి తప్పేటట్లవుతోంది. నరాలన్నీ పీకుతున్నాయ్. ఆయాసంగా వుంది. నడుస్తున్న ఆమె దబ్బున కూలిపోయింది. హిస్టీరియా వున్న మనిషిలా ఆమె కేకలు వెయ్యగానే పోలీసులు ఆమెను అక్కడ విడిచి వెనుకకు వెళ్ళిపోయారు.

ఆమెకు తెలివి వచ్చే సరికి ఏకాదశి చంద్రుడు పశ్చిమాంబుధిలో క్రుంకిపోయాడు. ఆకలి...బ్రహ్మాండమైన నీరసం... కాలు కదపలేకుండాపోతోంది. అంతా కలలా వుంది. తను యెక్కడ వున్నట్లు? తెలుసుకోడానికైనా శక్తిలేదు. అలా ఆ మెట్టుపైనే మళ్ళీ తల వాల్చింది.

ఆ సమయాన చల్లనిగాలి వీచింది. ఆ గాలి ఒక స్వరాన్ని మోసుకవచ్చింది. ఆ నిర్మల వాతావరణంలో ఆ కమ్మని స్వరం మెదడులోని సర్వ నాడుల్లోనికి వ్యాపించి జీవం పోస్తోంది. ఆమె లేచిచూసింది. ఎవరూ కనపడలేదు. ముందుకు ప్రాకి వంగిచూసింది. అదిగో అల్లంతదూరంలో ... యెవరో కూర్చొని హరినామ స్మరణ చేస్తున్నారు. పుట్టుధార దగ్గరనున్న విద్యుద్దీపం కాంతి అతనిమీద పడుతోంది. అక్కడకు వెళ్ళటానికి లేచింది. రెండడుగులు వేసేసరికి కాళ్ళు వణికాయ్. తూలిపోయింది. గుండె గడగడ కొట్టుకుంటోంది. ఐనా మెల్లగా అటువేపు ప్రాకుతూ, ఆగుతూ ప్రాకుతూపోయి ఆ మనిషి కొద్దిగాదూరంలో ఒక సంపెంగచెట్టు మొదలుకు చారబడి కూర్చుంది. ఆమె వచ్చిన చప్పుడు అతనికి వినపడినట్లు ఎదరగావున్న ఆమెను చూసినట్లు వున్నాడు.

అతనివేపు చూసింది—ఒకచేతి తంబురా యింకోచేత చిరతలు. తెల్లనిగడ్డం, నెరపోసిన జుత్తు. మెడలో రుద్రాక్షమాలలు, చిన్నపంచె. ఆమె యెంతసేపో అతనివేపు చూడలేదు. ఆ చెట్టు మొదట్లో చారబడి చిన్నస్వరంతో "ఆకలి...ఆకలి..."అంది.

పాట ఆగిపోయింది. "ఎవరమ్మా..." అన్నాడు.

"ఆకలి...ఆకలి..."

"రా అమ్మా...రా... ఇదిగో పళ్ళు."

ఆమె అటువేపు కళ్ళు త్రిప్పింది. దగ్గరనున్న జోలెనుంచి మూడు అరటిపళ్ళు తియ్యటం చూసింది.

"తే...యిలా విసిరే బాబూ..."

"తీసుకో అమ్మా..."

"లేదు...ఇలా విసిరే బాబూ."

విసిరిన పళ్ళు సరిగ్గా ఆమె ఒడిలో పడాయ్. ఆమె ఒక్క పండునోటిలో పెట్టగానే అమృతంలా రుచించింది. శక్తి చేకూరుకోసాగింది. అలా అతనివేపు చూస్తూనే మిగతా రెండు పళ్ళను తిన్నది. మరుక్షణంలో మెల్లగా లేచి యెదరగావున్న ధార దగ్గరకు వెళ్ళి కడుపునిండుగా నీరు త్రాగింది. తిరిగివచ్చి మళ్ళీ ఆ స్థలంలోనే కూర్చుంది. నక్షత్రాల వెలుగుతున్నాయ్. చల్లనిగాలికి చెట్టు కొమ్మలు వూగుతున్నయ్.

"రా అమ్మా...రా..." అని పిలిచాడు.

"ఈ పాపిని నీలాంటి పుణ్యాత్ముడికి దూరంగా వుండనీయ్ బాబూ!

"పిచ్చితల్లీ! పాపపుణ్యాలు దేవుని తాలూకు రెండు కళ్ళమ్మా...రెండు కళ్ళూ ఆ దేవునికి ప్రియమైనవే! అవి లేకపోతే యీ లోకంలో దివారాత్రులుండవు - మనుషులు మనుగడే లేదు. ఇంతకీ నీవు పాపివని యెవరనగలరు?"

ఆమె కొంచెం ముందుకు జరిగి "నేను పాపినికాక యింకెవరను బాబూ? తాగుతాను, నా శరీరం అర్థికిచ్చి బ్రతుకుతాను—నేను నడిచే త్రోవలో నన్నింతగా ప్రేమించిన మావాళ్ళే నడవరు కదా?"

అతను చిరునగవుతో ప్రశాంతస్వరంతో "బాధపడ్డావు కాబట్టి నిన్ను ప్రేమిస్తున్నాను. చాలమంది అసహ్యించుకున్నారు కాబట్టి నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్నే అందరికంటె హెచ్చుగా ప్రేమించవలసిన వాడను. అందుకే నిన్ను ప్రేమిస్తున్నాను."

అతని హృదయంనించి స్వచ్ఛమైన కంఠస్వరంతో వచ్చిన యీ మాటలు వినగానే ఒక్కసారి ఆమెహృదయం వుప్పొంగిపోయింది. ఆవేశంతో ముందుకు వంగిపోతూ సాష్టాంగపడి ఆనందబాష్పాలతో "అయితే నీవే నా తండ్రివి, నీవే నా భర్తవు, నీవే నా బాబువి, నీవే నా దేముడివి. నీవే నా సర్వస్వం బాబూ!"

భర్తను కౌగలించుకోడానికి ఉద్రుక్తమైన భార్యలా, బిడ్డను ముద్దులాడబోయే తల్లిలా, తండ్రిని గౌరవించే కుమార్తెలా, దేవుని పాదాలముందు తల వ్రాలే భక్తురాలిలా ఆమెలో నానావిధములైన అనుభూతులు రేగి అతని చేరువకు కదలిపోయింది.

తంబురా మీటుతుంటే...అతనితో కలసి గొంతుక విప్పింది. నిర్మల వాతావరణం. వసంతపు కోర్కెలో హృదయాలు పరవశి మర్యొ ఆ కమ్మని దివ్యసంగీతం భూపరిధులను దాటి ప్రతిధ్వనిస్తోంది. ఆ కమనీయగాత్రం ఆమెదేనా? ఆమెలోవున్న దేవునిది... అది ఒక్కపాటే కాదు—'జీవం! జీవమే కాదు శబ్దస్వరూపంలో వున్న దేముడే!'

ఈ దివ్య సంగీతంతో ప్రకృతంతా శోభించింది. ప్రాణులంతా పరవశమయ్యాయ్. చెట్లు తల లూపుతున్నాయ్. కోయిల ఒకసారి కోర్కెప్పి ఆపివేసింది. తెలివితోవున్న పక్షులు పిల్లలతో ముద్దుటలమాని గూళ్ళలో నిశ్శబ్దంగా వింటున్నాయ్. అదిగో అదిగో వసు పుట్టచాటున నాగరాజు తలాడిస్తున్నాడు. పూలపై వ్రాలిన తుమ్మెదలు మకరందం గ్రోలటం మరచిపోయాయ్. పైలోకాలకి చేరి గంధర్వ కిన్నెర, కింపురుషులు గొంతుకల్లో కదలి మళ్ళీ ప్రతిధ్వనిస్తోంది సంగీతం! మాయ మర్మాలను చీల్చి మానవాళిని పశుపక్షి, వృక్షాదుల్ని ఆనందాబ్ధిలో ఓలలాడిస్తోంది! మానవ ప్రవాహం చుట్టూ చేరుతుంది.

ఆమె, ఆ విరాగిచుటూ నృత్యంచేస్తూ దేవదేవుని కీర్తనలో తన్మయత్వమై పరమానందాన్ని పొందుతోంది. కళ్ళవెంబడి అతి తడవుగా ఆనందబాష్పాలు రాలుతున్నయ్.

ఉషస్సు యీ సంగీతానికి మంత్రముగ్ధయై పరుగెత్తుకొచ్చింది. ఏం చూసింది? దైవత్వాన్ని పొందిన మానవస్వరూపం ఒక్కసారి ఆ విరాగి ఒడిలో కూలిపోయింది. తంబురా తీగలు తెగిపోయాయి. పక్షుల కలకలం—నాగరాజు పగడ నేలను కొట్టాడు. ప్రజలకళ్ళల్లో కన్నీరు చిమ్మింది—

నేత్రాలు లేని ఆ విరాగి తన ఒడిలోవున్న కపైముఖాన్ని తడుముతూ చేతితో తాకాడు. అతని కన్నీటిబిందువులు ఆ ముఖంపై రాల్చుతూ "ఈ మంచి ముహూర్తాన్ని మనిషి ధరించలేకపోయాడు. దేముడు ధరించాడు!"